


ఆ నాడు..................

దినమల్లా వుపవాసాలుండేవారూ, పూజలు చేసుకునేవారూ, రాత్రి జాగారాలు చేయడానికి సిద్ధపడేవారూ.... ఇంకా వుత్స వానికనీ—అ—రేయి నిదుర లు మాని బయలుదేరేవారూను....

—ప్రపంచమంతా ఒక్కసారి వెలుగులోని కీద్వబడిందా? కలకలలాడుతూ, కిలకిల నవ్వుతూ—ఏదో పాటలో పడిపోతున్నట్లు, ఎక్కడికో ఏమో అయిపోతున్నట్లు............

చీకటి పడిందని కాబోలునే! దీపారాధనలు చేసి, గృహలక్ష్ములు పక్షిపిల్లలతో సర్వభానుడికి మంగళహారతులు పాడుతున్నారు; చేయెత్తితిరిగి రమ్మని దీవించి పంపుతున్నారు————

అన్నమాటేగాని, భానుడులేని కొరత యెక్కడ? ప్రతి గృహమూ మళ్లీ దీపాల తోరణాలతో అలంకరింపబడింది. పైన చల్లని వెన్నెల; లోన దీపాల వెల్లువ—ఇం కెక్కడిదీ చీకటి!

లోకమంతా ఆనందమరీచికలలో తేలిపోతోందా? మానవకోటి అంతా తమ ఎప్పటి కక్షలూ, ఎప్పటి పక్షాలూ, ఎప్పటి భేదాలు....అన్నీ—తమ స్వభావాలనే తమ వ్యక్తిత్వాలనే—మరచి పోయారా?.... ఇది కార్తీక పూర్ణిమా?

* * *

ఆవును!

ప్రపంచాని కంతటికీ కార్తీకపూర్ణిమ.... కాని, ఆయింట మాత్రం.... నిత్య అమావాస్య!!

అమావాస్యచీకటి ఆ యింట్లోనుంచి తప్పుకోదు. ఆ చీకటిని తరిమి వేయడానికి తగిన—సరిపడ్డ—దీపాలు లేవాయింట.... ఆయింట ప్రకాశమానంగా వెలుగుతూ, జ్యోతులు వెదజల్లుతూ వుండవలసిన—మణి దీపం—ఒకటీ....ఆఖరికి—లేదు.... లేనేలేదు!

ప్రపంచానికేమో పూర్ణిమ—ఆ యింటికేమో అమావాస్య. అంతే.

ఆఖరికి పట్టపగలు కూడా సూర్యకాంతి, ఆయింట్లోకి చొచ్చుక రావడానికి భయపడుతుంది.

ఎవ్వరూ ఆ కాంతిని అడ్డుకోరుగాని—ఆహ్వానించే వారు మాత్రం వుండవద్దూ?

అయినా ఎవరికోసమనిపిస్తుంది—ఎవరితో ఆడుకుందామనిపిస్తుంది?—ఎవరిని పలకరిద్దామని—పోనీ, ఎవరిని చూసి నవ్వుకుందామని వస్తుంది? వెలుగు!!

ఇంక మిగిలినదల్లా—ఆ యింటికి వెలుతురూ చీకటీకూడా—ఒక్కతే—శాంతమ్మ!

* * *

నారాయణమూర్తి ఆయింటికి యజమానుడు. అతను ఎప్పటి అలవాటు కంటే ఒక మోతాదు ఎక్కువగానే ఈరోజున విసుగుగావున్నాడు. తనప్రాణం, తన మానం అయిన ఇనప్పెట్టె ముందు మఠం కట్టుకుని కూర్చుని, తలకాయ బద్దలు కొట్టుకుని మరీ ఆలోచిస్తున్నాడు.... ఎంతకీ తెగూ తెంపూ కనపడడం లేదు—దానికి.

ఆమె దీపం వెలిగించడానికని గదిలోకి వచ్చింది.... భర్తని చూసింది.... ఎప్పటి మాదిరి దాచుకుంటూన్న ఘనకార్యం చేసిన చిరునవ్వుతో "ఏం సంగతి" అని అడుగలేదు.

ఆమె వెళ్లిపోతూవుండడం చూసి మనస్సు పట్టలేక, టపాకాయ పేల్చినట్లు—

"ఇందులో ఏదేనా తీశావా?" అన్నాడు. అన్నందుకు నాలిక కొరుక్కున్నాడు. "అయినా ఫర్వాలేదనే ధైర్యంతో కాళ్లు కొంచం గట్టిగా బిగించుకుని, ఆమెకేసి చూడబోయి, తలవంచుకుని కూర్చున్నాడు—చిఠా పుస్తకాలమీద దృష్టి స్థిరపరుచుకుని.

ఆప్రశ్నకి ఆమె ఆగింది. ముఖం చిట్లించుకుంది. తన పదిహేడేళ్ళ కాపరం ఈ వొక్క మాటతోనూ పుల్లవిరుపయిపోయినట్లు భావించుకుంది. బాధపడేదే; ఎరగ దేమో—సరిపోయింది!

ఇన్ని రోజుల్లోనూ కూడా, భర్త తన్ను ఈవిధంగా ప్రశ్నించవలసివచ్చిన సమయం ఒక్కమారూ రాలేదు....—ఏజన్మానీ డబ్బు ఏమయిపోయిందీ అన్న ప్రసక్తి రాలేదు కాబట్టి.

అతను కష్టపడి రెండుడబ్బులు వెనక వేస్తే, ఆమె ఎడంచేత్తో ఏమీ ఎరగనట్లు నాల్గుడబ్బులు వెనక్కి తోసేది! ఇంతకూ ఫలితం? సాయంత్రం ఇనప్పెట్టె తిరగ వేసుకునేసరికి—ఉండవలసిన దానికంటే కొంచెం ఎక్కువే మిగిలుండేది!

'డబ్బుగాని పిల్లల్ని పెడుతోందా' అని కొంతకాలం అనుకుంటూ వచ్చేడు. కాని,

రాను రాను, నిత్యం గంటన్నర ఆలోచన మీదట—ఆఖరికి నిజం తెలుసుకో గలిగేడు.

"నాకు తగిన భార్యాని ప్రసాదించేవురా భగవంతుడా!" అని అతను అతి రహస్యంగా ప్రార్థిస్తూ, గర్వపడుతూ వచ్చేడు—ఇన్ని సంవత్సరాలలో....అన్ని రోజులూను.

తన భర్త, సొమ్ము విషయంలో తనని అడిగేసరికి—కోపమూ, చిన్నతనమూ, అభిమానమూ, ఉడుకుబోతుతనమూ— అన్నీ ముసురుకువచ్చేయి,....ఇంతకాలం అయింది గాని, తను స్వంతంగా, స్వతంత్రించి, ఎవరికీ తెలియకుండా, ఒక్క కానీ డబ్బు ఖర్చు పెట్టుకొనడం నేర్చుకోలేకపోయానుకదా అనుకుంది. ఆ భావన ఇన్నాళ్ళకు ఆమెకు కలిగింది.

—భర్త మళ్ళీ ప్రశ్నించేడు.

"ఊ—"అని ముక్కింది. ఆమాత్రం సమాధానం యిచ్చి వెళ్ళడానికి వెనక్కి తిరిగింది.

నారాయణ ముఖాన చటుక్కున కొంత మబ్బు చెరగిపోయింది.

"ఎంత తీశావ్? ఎప్పుడు తీశావ్? ఎలాగ తీశావ్? ఎందుకు తీశావ్?" అంటూ ప్రశ్న పరంపరలు గుప్పిస్తూ నిలవదీస్తున్నాడు—

అపారప్రేమతో, ఇంతవరకూ నిష్కారణంగా నిందించుకుంటూవచ్చిన, చిఠా ఆవర్జాలను గుండెలకు హత్తుకుంటూ........

"పాతికీ—ఇందాకా—ఈ చెతుల్తో—" అంది విసురుగా, తిరస్కారంగా. "ఎందుకో చెప్పడానికి మాత్రం వీలులేదు," అని నసిగి వెనక్కి తిరిగింది మళ్ళీ.

తీసింది—ఖర్చయి పోయేయి! అనవసరంగా అంత మొత్తం ఖర్చయిందనేసరికి, అతని మనస్సు చివుక్కుమంది. భార్యనేమీ అనలేక....చిఠా తెరచి, కలం చేత్తో పుచ్చుకుని, నసిగేడు—

"మరి యెందుకు ఖర్చయ్యేయని రాయమంటావ్?"

రాబోయే తుపానుకు, ముందే జడుపుతో తలవంచుకున్నాడు.

"నే తీసుకున్నానని రాయండి" అంది ముఖం చిట్లించుకుంటూ.

"ఎల్లా?" తెల్లబోతూ ఆమె ముఖంకేసి తిరిగేడు,—"రాయండీ" అంటే సరేనా?"

"నే చెప్పడానికి వీల్లేదు....చెప్పనోయ్ చెప్పను....చెప్పనుగాక,—ఏం? ఆమాత్రం స్వతంత్రం లేదా అంట నాకు?....ఈ యింట్లో ఏం పెత్తనం లేదన్నమాట నాకు?"—

ముఖం రెండోవేపుకు తిప్పుకుంది: స్వతి తగ్గించింది—

"....తిరిగి ఇచ్చేస్తాన్లెండి.... ఒకళ్ళ డబ్బు నాకెందుకు?...."

—ఈ విధంగా వెడుతోంది ధోరణి.

ఏమీ అనలేకపోయాడు కొంతసేపటికి--

"అది కాదే—ఇలా చూడు....ఎలా రాసుకున్నా ఇబ్బంది లేదు....కాని, చిన్న చిక్కు:—ఖర్చుపెట్టేంకదా—ఖర్చుకు తగిన రశీదుంటేనేగాని—రాసుకునే యందుకు దాఖలా ఎలాగా అని...." తన అమాయకం వెళ్ళబోస్తూ ఒక్క చిరునవ్వు పోనియ్యబోయాడు. "—మరి ఇవి చిఠా ఆవర్జాలనుకున్నావా లేక—?" అని తన సొంతమైన వాఙ్మూలానికి సాక్ష్యంగా తన గాయత్రిని చూపినట్లు, ఆ చిఠాఆవర్జాలని చూపేడు.

ఆమెకు కోపంపట్టశక్యంకాకపోయింది. చటుక్కున పులిచేరునాను మెడలోంచి తీసి, అతనిమీదకి గిరవాటేసింది—

"దానికి తాకట్టు డబ్బులిచ్చేనని మీ దస్తావేజులలో రాసుకోండి," అని తారాజువ్వలాగ వెళ్ళిపోయింది.

* * *

ఆ పుణ్యదంపతులిద్దరిమధ్యా వాదం గాని, వివాదంగాని, అభిప్రాయభేదం గాని రావడానికి అదే ప్రథమం....ఆరావడం విసరులోనూ మంగళసూత్రాలనే భర్త ముఖానికి విసిరివేసేటంతపర్యంతం ముంచుకు వచ్చింది:

ఆమె విషయంలో ఈషన్మాత్రమేనా తప్పులేదని అతను తెలుసుకున్నా తెలుసుకోకపోయినా, ఆ నగని మాత్రం తీసుకుని, మాట్లాడకుండా ఆమెను వెతుక్కుంటూ వెళ్ళక తప్పలేదు.

—ఆశక్తి అటువంటిది!

ఆమె యింట్లో లేదు....వాకిట్లో లేదు.... ఇటూ అటూ తిరిగేడు....పెరట్లో—గోడ దగ్గిర—కొంతదూరంలోవున్న తిన్నెమీద నిలుచుని, ఆమె నిదానంగా పక్కింటి పెరట్లోకి చూస్తోంది—

ఆమె ముఖం ప్రశాంతంగానే ప్రకాశిస్తోంది,—ఆ పెరట్లోంచి వచ్చే మతాబా చిచ్చుబుడ్ల వెలుగు జల్లులో.

నెమ్మదిగా ఆమె ప్రక్కకు చేరేడు. ఆమె గమనించలేదు. 'ఏమిటా ఆవింత' అనుకుని తనూ చూడసాగేడు:

వెంకమ్మగారి మనమరాళ్ళు యిద్దరు. వాళ్ళిద్దరూ బాణాసంచాకాలుస్తోంటే రవణమ్మా వెంకమ్మా ఆనందంతో చూస్తున్నారు....

ఈమధ్య నిత్యం ఇటువంటి వేళకి ఆ పిల్లలు వెన్నెల పువ్వు ఆడుకుంటూవుండడం, శాంతమ్మ ఇదేవిధంగా చూస్తూవుండడం జరుగుతోంది. మరి ఈరోజు కార్తీక పూర్ణిమకదా—దీపావళీనాడు మిగుల్చుకున్న బాణసంచా ఈరోజుతో ఆఖరు చేస్తున్నారు!

పొగ కళ్ళల్లోకి వస్తోంటే, మతాబాని తిన్నగా పట్టుకోలేకపోతుంది పెద్ద పిల్ల.

"అలా కుడిచేతివేపుకి తిప్పు" అంటోంది వెంకమ్మ. "అమ్మాయ్! వొదిలెయ్యి తల్లీ—చేతిమీదికొస్తూంది....బట్టంటుగుంటుంది—ఊ—"

తల్లి చంకలో చంటిపిల్లతో—తులసికోటకి దగ్గరగా పెట్టిన చిచ్చుబుడ్డిని, ఒక చేతితో మతాబాపట్టుకుని వెలిగించి వెనక్కి

వచ్చింది. ఝుంయ్‌మని ఆకాశానికి ఎగిరే పూలరవ్వలని చూసి తెయ్యిమని కేకలతో గంతులు వేస్తున్నారు పిల్లలు.

ఆ గంతులు తదేకదృష్టితో చూస్తోంది: ఆ పిల్లల ప్రతి చేతలోనూ ఆమె మనస్సు కేంద్రీకరింపబడి వుంది. తను—అక్కడ వాలాలనీ, ఆ ఆనందం, ఆ సౌందర్యం తనూ పంచుకోవాలనీ—ఆసక్తిపడుతోంది. నిమిషానికి శూన్యభావంతో, ఏదో తలపునకు వచ్చినప్పుడు, చిరునవ్వుదోపే పెదవి కదలికతో—వుండి వుండి గబుక్కున అంది

"ఏం?—అలాంటి ఒక్కపిల్ల వుండకూడదూ—?"

ఈవీలు చూసుకొని, భర్త, "ఇదిగో—"అని, ఇంతవరకూ తనని చూడని ఆమెని, లేపేడు.

ఆమె కదలింది—ఆ నిద్రలోంచి, అతనిచ్చిన 'పేరు' అలాగనే—పరధ్యానంగా—మెడలో వేసుకుంది.

"ఆ పిల్లల్ని చూసేరా?" అంది.

—ఆమె భావమే గ్రహించేడో? కొంచెం విసుక్కున్నాడు.

'మనం కారణమా?' అన్నట్లు చూశాడు. ఇంకో ప్రసక్తిలేదా?' అనుకున్నాడు. "అబ్బ చాలా రాత్రయింది!" అని భోజనం విషయం సూచించేడు.

"ఇంతుంది....ఎవడికీ?" అంది. కళ్లు పెద్దవిచేసి, 'ఒక్కపిల్ల వుంటే—' చిరునవ్వుతో అనుకుంది; నిట్టూర్పువిడిచింది.... "ఎంత బావుంటుందీ?" అని అడిగింది, భర్తని

'ఏవిటీ? నీకు మతిలేదూ?' అందామనుకుని, "....మనం ఏంచేస్తాం—?"అన్నాడు నీరసంగా.

ఈ సమాధానం ఆమెకు అసహ్యం వేసింది. ఆమె అతన్ని అడిగేది తన అసహాయతని చెప్పమని కాదు; దేవుడి తెలివి తక్కువ్వ చెప్పమనీ కాదు....పిల్ల వుంటే ఎలావుంటుందీ? అప్పటి తన సౌందర్యాన్నీ ఆ ఆనందాన్నీ....వర్ణించమని!

ఆమె కోపంతో వెళ్లిపోతూంటే—.

"అవును—చాలా చాలా బావుంటుంది! ఎంత బావుంటుందీ—!" అన్నాడు, తప్పనిసరిగా. అతనికి పిల్లలు అక్కర్లేదని కాదు కాని లేని దానికి 'మనం ఏంచేస్తాం?' అని!

"నేను మాత్రం వూరికే ఖర్చుపెడతానా—చెప్పండి??" మెట్లెక్కుతూ ఒక్కక్షణం నిలిచింది, అంది; "వాళ్ల సూరమ్మ పిన్నికూడా వెడుతోందికదా అని....ధైర్యం చేసి పంపేను—మనం యలాగా వెళ్ళేది లేదు....వొచ్చేటప్పుడు అనాసకాయలు—సింహాచలంలో బాగా దొరుకుతాయిట—తెస్తానంది."

అతని ముఖంలో విసుగు 'అంత సొమ్మెందుకూ?' అని.

ఆమె చూడదు.

"మిమ్మల్నడగ లేదన్నమాట గాని, మీరు మాత్రం వొద్దంటారు గనకనా?...."

౨

కళా కాంతులూ లేని ఆయింట్లో ఎప్పుడూ ఒకేమాదిరి జీవితం నడుస్తూవుంటుంది. ఆ బండికి చక్రాలు ఆ యిద్దరూను....ఒకరిని మొయ్యాలన్న భయం లేదు; ఒకకొత్తత్రోవ త్రొక్కాలన్న ఇదీలేదు; ఒకఅడుగు ముందుకు వెళ్ళాలన్న తొందరలేదు—అయ్యో వెనక్కు పడిపోతున్నామే అనీ ఇఒలేదు....!

నారాయణమూర్తి తన పనుల నన్నిటినీ స్వయంగా చేసుకుంటాడు: ఇనప్పెట్టి దగ్గర కూర్చుని లెక్కలు సరిగ్గా వున్నాయో లేదో చూసుకుంటాడు—సాయంత్రం ఒక్కసారి బయలుదేరి పెద్ద వీధిలోకి చిన్న షికారు కొట్టి వస్తాడు—....అంతే అతని దినచర్యలోని ముఖ్యాంశాలు.

ఇంకొక్క మహత్తర విషయం చెప్పుకోతగ్గది వుంది: ఉదయం పక్షులతోనే లేచి, శాస్త్రప్రకారం దక్షిణ దిక్కుగా ఊరుచివరకి పయినమయ్యి, అక్కడ తన పలుదోము పుల్ల తనే సాధించుకుని, కాల్యకృత్యాలు తీర్చుకుంటాడు. ఝాంపొద్దెక్కేసరికి ఇంటి గుమ్మం యెక్కుతాడు.

అప్పటికి భార్యాదేవి శాంతమ్మ పాచిపను లన్నీ చేసుకుంటుంది. నిదర్శనంగా నాలుగు బారలు పొడుగునవున్న చీడీలు కడిగి, ఆఖరి దానిమీద ముగ్గుబొట్టు పెడుతుంది. పెరటి గుమ్మందగ్గిరకూడా అంతే, ఇరుగుపొరుగుల వారితో సరిసమానంగా ముగ్గులు తీర్చి దిద్దడానికి ఆమెకు చిన్నతనంలో ఎవరూ నేర్ప లేదు. తర్వాతనేనా తను నేర్చుకోలేదు.... అయినా ఆమెకి ఇదే పనా??

ఆమెకు వల్లమాలిన కోపం. అది స్వతహాగా పుట్టుకనుంచీ వున్నది కాదు. వాతావరణాన్ననుసరించి, చక్కగా అలంకరణలతో, ఎదిగివచ్చిన దత్తీపుత్రి....ఇంకా ఎదుగుతూనేవుంది. ఆమెతో ప్రతి పనిలోనూ కూడానే వుంటుంది—

వాకిలి వూడుస్తూ వూడుస్తూ, తిన్నగా దుమ్ము పోగుజెయ్యాని, చీపురుని, ఒక్కసారి నేలనేసి కొడుతుంది. అన్నం తింటూ తను అనుకున్నపాళంలో పులుసు కలవకపోడం మూలాన్ని, మంచినీళ్ళచెంబుని ఒక్కతోపు తోస్తుంది. తర్వాత—మర్యాదా—మెల్లగా నీళ్ళు తుడుచుకుంటుంది.

ఇంకా చిత్రమేమంటే, వీధిలో కూరగాయల అమ్మి తను కోరిన కొసరు మెంతికూర వేసింది కాదని ఆపూట అన్నం మాడ్చబెట్టింది. పొయ్యి తిన్నగా అంటుకోలేదు కాబట్టి రాత్రివేళ పక్క పరుచుకుని భూశయనం చేసింది......

ఈవిడకి రోజుల్లా తీరుబడే! అసలు ఏమైనా పనంటూవుంటే దాసీదిచేసి పోతుంది....దాసీదాని అవసరమే లేదంటాడు భర్త. ఆ సంగతి నిజమేనని ఆమె వప్పుకున్నా, పక్కింటి రవణగారిని చూసి, దాసీది మరి తప్పదంది—

ఇంక తను ఇంత అన్నం ఉడకవేసుకొనడం—అదేనా పిన్నత్తగారు ఊర్లోలేని రోజునే!—ఇంత తినడం, ఎవరేనావస్తే వాళ్ళతో తనకు సంబంధంలేని కబుర్లు చెప్పుగుంటూ కాలక్షేపం చెయ్యడం.

....ఇలాగ ఎంతకాలం గడుస్తుంది జీవితం?

—ఒక పెద్ద కొంప—అమ్మావారులా వుంది. కావలసిన భూవసతీ ఆదాయమూ వుంది....

ఇంక ఆ దంపతుల విషయంలో కాలం నిర్విచారంగా పదిహేడు నిండుసంవత్సరాలు వెనుక పడవైచింది—

కాని, వారి జీవితంలో—ఏమో మొదటి రోజులు ఎలాగ గడిచేయోగాని—అంతకన్న అంతకన్న రోజులు దుర్భరమనిపించసాగేయి. అతనంటే ఆమెకీ, ఆమె అంటే అతనికీ—ఎప్పటివారే అయిపోయి, ఒకవిధమైన రోతకూడా పుట్టిపోయింది. ఎంతసేపూ అమావాస్య చీకటిలోపడి తోడులేకుండా—వెతుక్కుంటూ—ఎక్కడికో, ఎందుకో—పోయే మాదిరిగావుంది బతుకు!

ఎన్నాళ్ళని అదే మాదిరిగా, అదే పద్ధతులతో, అదే రుచులతో, అదే జీవులతో గడపడం?

అందుకనే ఆవరించుకుని వారితో కాపురముంటుంది చీకటీను. దానికి తగిన దీపం లేదు—సౌఖ్యమూలేదు.

ఆయింటికల్లా ఒక్క గుడ్డిదీపం వెలిగిస్తారు. ఆ దీపాన్నే అవసరాన్నిబట్టి ఇటూ అటూ తిప్పుకుంటారు. 'ఇంకో దీపం అవసరమేలేదు' అంటుంది ఆమె. 'అంత ఖర్చెందుకు?' అని అతను. నిజమే! ఇద్దరూ లేక ముగ్గురు మనుష్యులకి ఒక్క దీపం చాలదో?

* * *

పెరటిగోడ ప్రక్కనే అరుగుమీద నిలుచుని చూస్తూ గంటల తరబడి వుండిపోవడం అలవాటూ పరిపాటీ అయిపోయింది శాంతమ్మకు.

అది భోజనాల వేళ, విస్తరీ పీటావేసి, మంచినీళ్ళచెంబు తొలుచుకు వద్దామని పెరటిలోకి వచ్చింది....యథా లాభంగా అరుగు మీద నిలుచుని చూడనారంభించింది....

ఆ యిద్దరే—ఆ పిల్లలే—

నీళ్ళబిందెల దగ్గర ఆడుకుంటున్నారు. చెంబులతో నీళ్ళు ముంచనూ, దిమ్మరించి పొయ్యనూ—ఒకరిమీద ఒకరు దిగబోసుకోనూ—

అలాటి ఆటలకా? తనైతే ప్రత్యేకంగా నలుగురు మనుష్యులనుపెట్టి—అబ్బే, తనే స్వయంగా....నాలుగు గంగాళాల నీళ్లతోడి సిద్ధపరిచేది! కాని, వాళ్ళ తల్లికి, పాపం, అంత తాహతా??

రవణమ్మ ఇంట్లోంచి రుసరుసలాడుతూ వచ్చింది. ఇద్దర్నీ చెరి రెండూ చరిచింది. "రెక్కలడి పోతున్నాయమ్మా—"అని విసుక్కుంటూ, తిట్టుకుంటూ, ఇద్దరి రెక్కలూ దొరక పుచ్చుకుని, ఇంట్లోకి లాక్కుపోయింది. పిల్లలు గొల్లున ఏడుస్తున్నా లెక్కచెయ్యక—

శాంతమ్మ మనస్సు చివుక్కుమంది. ముడుచుకుపోయిన మొహంతో, ముసరుకు వస్తున్న భావాలతో, వంటింట్లో అడుగు పెట్టింది.

అప్పటికి అరగంపై భోజనానికని కూర్చున్న నారాయణమూర్తి, రుసరుసమంటున్నాడు—

విస్తరిమీద నీళ్ళు చల్లుతూ, "యల్లాగ మనస్సు లొప్పుతాయో—?" అంది. నీళ్ళ చుక్కలు అతని కాళ్ళమీద రెండు పడ్డాయి. నిప్పు రవ్వలు పడినట్లు బాధపడుతూ, విసుగుతో కాళ్ళు ముడుచుకున్నాడు—

"హుం—" అని ఆమెకు సమాధానం యిచ్చి బిగుసుకున్నాడు.

* * *

ఇంటికి తగినంతా పెరడువుంది. అదివొక పెద్ద అడివి, మానవ ప్రయత్నం లేకుండానే పడి, మొలిచి, పెద్దపెద్ద చెట్లయి, ఆకాశానికి అంటివున్నాయి: జామి సీతాఫలపు చెట్లు ఫలాలు విరగకాస్తున్నాయి. ఆ మొక్కలంటే యేనాడూలేని శ్రద్ధ ఈనాడు శాంతమ్మకు కలిగింది.

పెరటినిండా పండ్ల చెట్లున్నాయికదా—అవి వుపయోగించుకొనడం ఇంతవరకూ ఆమెకు తెలియదు. సీతాఫలాలు వాతం చేస్తాయనీ, జామిపళ్ళు అజీర్ణం చేస్తాయనీ—వాటిని పూర్తిగా విసర్జించింది. అనుభవించడం చేతకానివాళ్ళకే అన్ని సదుపాయాలూను. ఈనాడు ఏమి బుద్ధిపుట్టిందో, ఒక బుట్టెడయితే సీతాఫలాలుకోసి పొరుగింటికి పంపించింది, అప్పలమ్మచేత!

ఏ జన్మాన్నీ పొత్తుకలవని రవణమ్మకనికాదు....రవణమ్మమాట ఆమెకు జ్ఞప్తికే లేదు—రవణమ్మ అనే తలుపు, తను వెళ్ళబోతున్న గుడికి మూయబడివున్నదన్న తలపు లేదు....ఆ పొరిగింటిలో మసలే—వెలుతురులు వెదజల్లే—రెండు దీపాలకని—నివేదన అని—పంపించింది.

తను వారికీ వీరికీ మధ్యగా నిలిచివున్న గోడ దగ్గరికిపోయి, ఏమేనా మాటలు వినపడతాయేమో అన్నట్లు, చురుకుగా వింటూ నిలపడింది....కొంతసేపటికి అప్పలమ్మ పళ్ళబుట్టతో తిరిగి వచ్చింది.

సమాధానంకోసం—ఏం జరిగిందో అనే ఆతురతతో—మాటరేక శాంతమ్మ నిలబడింది.........

ఏం జరిగింది?—జరగవలసినంతా జరిగింది!

అప్పలమ్మకి ఒకవిధాన తలుపు తియ్యబడ లేదు. ఆ తీసినవారు—రవణ. చంకలో చంటిపిల్ల వుంది. అప్పుడప్పుడే తలంటి సాం[బ్రాణి]పొగవేశారు కాబోలు! పిల్ల జోగుతూవుంది.

"ఓహో—నువ్వా!...." అని సణిగింది రవణ. "కేక వినబడింది—పనిలోవుండి పోయాను."

పళ్ళబుట్టని చూసింది. తెల్లబోయింది. ఏమీ అర్థం చేసుకోలేకపోయింది. చూడనట్లే వూరుకుంది. "ఏం?—ఏదో పనిమీద వచ్చేవులాగుందే—" అని అంది.

"నాకెవరయినా ఒకటేనండమ్మగోరూ!" అనే ఉపోద్ఘాతంతో, అప్పలమ్మ తన యజమానురాలి 'ఆజ్ఞ' నెరవేర్చబోయింది—

నిజంగా వెలవెలబోయింది రవణ.

"ఎవరే—?" అంటు తల్లి రంగంలో ప్రవేశించింది. ఇది కొంత కూతురికి ఆసరా అయింది....

"ఏవిటే — అంటావ్?" రవణ మాట సాగతియ్యడం మొదలుపెట్టింది. "—మాకు పంపేరా?—మాకు??— శాంతమ్మగారు??? మాకెందుకు పంపుతారే??? పొరబడ్డావేమో??

"కాదండమ్మగోరు—మీకే—"

—"శాంతమ్మగారు మనకి సీతాఫలపళ్లు పంపేరుట!!!" అని వ్యంగ్యంగా తల్లికి అర్థం విప్పి చెప్పింది. ఎలాగయినా రవణ జాణ. అప్పలమ్మ కేసి తిరిగి అంది; "ఎలా నమ్మేనే?—ఏమో పంపినా పంపనూవచ్చు ....ఎందుకేనా ఎంతకేనా తగినదే— అయినా అన్నిపళ్ళు మేమేం చేసుకుంటామే? తినేవాళ్ళెవరు? బజార్లో కానీ పారేస్తే మూడు పొతకల్లాంటి పళ్లు....ఇంటినిండాపళ్లు కుళ్ళిపోతున్నాయి—ఓమూల — ఏంచేసుకుంటామనే?—" ఒక్కధోరణిలో వెళ్ళింది ఉపన్యాసం.

ప్రపంచం ఎరిగివున్న అప్పలమ్మకి ఆశ్చర్యం కలుగలేదు. బీదలు గొప్పవారిని సందర్భానుసారంగా నిలుపునా తృణీకరించెయ్యడం నిత్యం ఎరిగివున్నదే. తనకేం? బుట్ట చంకనుబెట్టుకుని శలవుపుచ్చుకుంది. అప్పలమ్మ వెనక్కాల, రవణా తల్లీ ఒకరికొకరు పంపుకున్న చిరునవ్వులు, ముళ్ళలాగ గుచ్చుకున్నాయి———

మాటలు వింటోన్న శాంతమ్మ తెల్లబోయింది—వణకింది. ఇలా జరుగుతుందని ఆమె అనుకోలేదు. తనతో మైత్రిచేసుకునేయందుకే అనుక్షణము రవణ కుటుంబం నిరీక్షిస్తూవుంటూవుందనుకుంది. తన స్నేహమే వారికి రక్ష అనుకుంది. తనుపంపిన పళ్ళు 'మహాప్రసాదం' అని కళ్ళకద్దుకుని స్వీకరిస్తారని అనుకుంది.

—కాని, తను—తనగౌరవం — తన ధనం—తన అహంభావం....అన్నీ తృణీకరింపబడ్డాయి—ఒక ఏమీలేని, ఏమీ కాని,—పిల్ల చేత!!

"ఇంటినిండా పళ్లు కుళ్ళిపోతున్నాయిట!!" అప్పలమ్మ నవ్వింది....బుట్ట అరుగుమీద పెట్టింది, ఇంటికి వెళ్ళిపోయేటప్పుడు తనే తీసుకుపోడానికి "తాగడానికి గంజినీళ్ళకి కరువు; పళ్ళుమాత్రం ఇంటినిండా కుళ్ళిపోతున్నాయిట!!!" అంటూ తన పనిలోనికి వెళ్ళిపోయింది.

ఇటువంటి తలవని సంఘటనలని ఎదుర్కొనే శక్తిశాంతమ్మకి ప్రసాదింపబడలేదు. ఆమె ఓడిపోతున్నప్పుడు, నిగ్రహశక్తిని కూడా కోల్పోతుంది. ఉడుకుబోతుతనంతో కోపంకూడా ముంచుకువస్తుంది. ఇప్పుడూ అంతే జరిగింది—

అప్పలమ్మ అనుకున్నదానికి వ్యతిరేకంగా, ఆ పళ్ళబుట్ట గబగబా తీసికెళ్లి నూతిలో పారవేసింది.

గిన్నెలు తోముతున్న అప్పలమ్మ గతుక్కుమంది "ఎంతటిదానికేనా తగుదువమ్మా" అని రవణ మాటలు పల్లవించుకుంది.

* * *

## 3

ఈ అనరాని ఆపేక్షంతా పిల్లలమీద ఈవేళనే ముంచుకు రాలేదు— శాంతమ్మకి............

ఒకనెలరోజుల క్రితం అయితే—ఆమె చంటిపిల్లలంటే ఏవగించుకునేదే; వాళ్ళు ఆడుకుంటూ వుంటే చూడలేకపోయేదే; వాళ్ళు తల్లుల చంకల్లో అల్లరిచేస్తూవుంటే, దోబుచ్చులాడుతూవుంటే చూడలేకపోయేదే.

తల్లుల అడ్డాలలో నలిగి, ఆకలికి పాలకోసం తడుముకుంటూ తల్లికి కిచకిచలు పెడుతూవుంటే—చూసి వోర్చుకోలేకపోయేదే;

—తనకి పిల్లలు లేరనే కారణం—ఈసూలుచేత, తనకి పిల్లలు కావాలనే ఆతృత యెక్కువ అవుతూన్న కొద్దీ, ఇంకొకరి పిల్లలనేసరికి ఎక్కువ అవుతూన్న అసహ్యమూ ఏవగింపులచేత;

దగ్గరికి వచ్చిన పిల్లని ఎలా తీసుకోవాలో అర్థంచేసుకోలేక కసరికొట్టేది. కళ్ళనీళ్ళతో కనపడిన పిల్లని కనికారంతో తీసుకోడానికి బదులు కోపంతో కరకర చూసేది....ఎదురుగా వెడుతూన్న పిల్లల తల్లిని హేళన పరిచేది—నీచపరిచేది;

పిల్లల మారాంలతో విసిగి, అటూ ఇటూ చాకరీ చేసి చేసి, సొలసి, ఓపిలేక, వగర్పుతో —ఎడనో పిల్లనీ, పెడనో పిల్లని పెట్టుకుని —నీలాటి రేవుకని బయలు దేరిన పచ్చని తల్లిని చూస్తే—

ఏదో కనలేనిమంట ఆవిర్లు రేకెత్తేవి, ఆమె గుండెలో;

ఆమెకంటి మంటకి ఆ తల్లి కన్నెత్తి చూసినట్లాయినా. గజగజ వణకిపోయేది.

చంటి పిల్లలు ఆమె దగ్గరకు వచ్చేవారు కారు. తోటి అమ్మలక్కలు ఆమె కళ్ళు మంచివి కావని గుర్తించేరు. ఆమె చూస్తూండగా పిల్లలకి పాలిచ్చే వారుకాదు. తాము ఒక్కగుక్కెడు పచ్చి మంచినీళ్లే నే తాగేవారుకాదు.

* * *

ఈ గోడకి ఇటు రవణమ్మ నిలిచి వున్నట్లుగానే—ఆగోడకి అటు జానకి కూర్చుని వుంది.

రవణలాగ కాక—కూర్చునీ యందుకు వీలెక్కడిది జానకికి?....వంచిన నడుం యెత్తదు. ఉదయానికి ముందే లేస్తుంది; మరెప్పుడు పడకనిజేరుతుందో! కోడంటి కంపదలేకపోతోందాయిల్లాలు. ఇటు అత్త ఆడబిడ్డల అదమాయింపులు, అటు మామ మరిదెల గస్తీలు, ఊరలేని భర్త—ఊరనున్నా ఊరడించలేని భర్త, తను నిందుఘూలాలు, చీటికీ మాటికీ తన గర్భంలో దాగున్న పసిమినిబాధిస్తూ—మాట మాటక్కీ సూటిగా పొడుస్తుంటే—దుఃఖం దిగమింగుకోలేక.... ఊరంతటిపనీ—చాకిరీ —తనమీదకే విరుచుకుపడిందన్న సంగతి యెరిగీ—ఏపనీచేయలేక — ఒంటరిగా.... ఇంటిపంచని సందులోచేరి....ఎవరూచూడరు కదా అని, ఇటు అటూ జాగ్రత్తగాచూసి మరీ—

గుభాలున, గుండెపగిలిపోయేలాగ—నిండుకడవ భడేల్న పగిలిపోయినట్లు—

ఏడుస్తోంది—ఆ అమ్మాయ....

ఇంకా ఏ యీడూ, ఏ జ్ఞానం—ఏ యింగితం, ఎరగని, సంపాదించని....నేర్చు కోలేని పాపిష్టిబతుకు....ఎవరితో చెప్పుకు ఏడుస్తుంది? ఎవరున్నారని కళ్ళనీళ్ళు తుడిచే టందుకు?....

తనకడుపులో—తనపేగుని అంటిపెట్టు కుని—తనప్రాణాన్ని కనిపెట్టుకునివున్న పసిమి మిసిమికోసం....

కాదూ?....కానియ్యి....ఇంతేనా—?

ఎవరూ చూడకేం? సర్వం ఎరిగివుంది—అక్కడ, చెట్ల చాటునుంచి సూర్యుడు ఎంత చూస్తున్నాడో—పక్కగోడమీదికున్న కిటికీ వూచలచాటునుంచి శాంతమ్మ ముఖం అంతా చూస్తోనేవుంది!!

ఎందుకూ? ఎవరుతోడు? ఎవరు నీడ? ఎవరివారు వారికే లేనప్పుడూ కానప్పుడూను.

ఆమె కడుపులోవున్న ముద్ద కదలినట్ల యింది. కళ్ళనీళ్ళు ఎండిపోతుంటే అలాగ చీడీలమీద కూర్చుండిపోయింది.

"ఇల్లాంటి బాధలు భరిస్తాను—నీకోసం. పీళ్ళు నన్ను సుఖపెట్టలేదనీ, నాకళ్ళనీళ్ళు తుడవలేదనీ—నేయేడవను....నువ్వేం బాధ పడిపోయి, అర్భకం అయిపోతావో అనే!.... నాకళ్ళనీళ్ళు తుడిచేవాళ్ళు వీళ్ళా? వీళ్ళకేం హక్కుంది?....

"రేపు నువ్వు—ఈవతలకివచ్చి—నా మొహంచూసి, నాకళ్ల తుడవకపోతే—అప్పుడు ఏడుస్తాను....నిజం....నిజం.... అప్పుడు!...."

—అనుకుంది.

అనుకుని వలవల యేడ్చింది,

ఏడ్చి ఏడ్చి—శూన్యంలోకి చూసింది. శూన్యంలోంచి ఎదుటి కిటికీలోకి—మళ్ళీ శూన్యంలోకి చూస్తూ నిలబడిపోయింది.

ఇంతలోకి విరుచుకు వచ్చింది. అత్త దగ్గర్నుంచి పెనుమంట!

భయంతో—ఎవరేనా ఆసరా ఇస్తారేమో నని ఇటూ అటూచూసి, నిస్పృహతో నడచి పోతుంది—

"నా కడుపులోవున్న పచ్చి గుడ్డు నేనా తిట్టకండీతల్లీ" అని మూగభాషలో ప్రాధేయ పడుతూ!

ఇదంతా 'నాటకం'గా తిలకిస్తుంది గొప్పింటి సుఖం మరిగినబిడ్డ—శాంతమ్మ.

ఆ అమ్మాయంటే తనకి మమకారం ఎలాగవస్తుంది? తనకి ఓ కూతురున్నప్పుడు, ఆ కూతురు పెద్దదై—ఇటువంటి ఇంట్లో పడుతుందని ఆలోచించుకున్నప్పుడు- భయ పడ్డప్పుడు—ఏమో!........

* * *

ఒకరోజుని శాంతమ్మగారింటికి బంధువు లొచ్చేరు....ఆమె పిన్నీ కోడలూను. కోడల్ని పురిటికి తీసుకువెడుతోంది పిన్ని.

కోడళ్ళచేత చాకిరీచేయించుకునే అత్తల్ని చూశాము, కోడలు పిల్లని కాలుకదపనీయదు ఈ అత్త!

ఆ అమ్మాయిని మంచంమీదనించి లేవ నియ్యదు. ముఖం కడుక్కునేందుకు నీళ్లు సహితం తను అందిస్తుంది—అనం దిస్తుంది. అన్నంకలిపి ముద్దలుచేసి చేతిలో పెట్టడానికికూడా సిద్ధపడుతుంది. చంటి పిల్లని వడిలోకి తీసుకున్నట్లు తీసుకుని—

"అలిసిపోయావే—నేవొచ్చి వొళ్లు రుద్దు దునుకాదే?—నే చచ్చిపోయానుటే తల్లీ!" అని ఎంతో యిదవుతుంది. కోడలు ఫాల తలంమీద ముంగురులు సరిదిద్దుతూ ముద్దులు కురిపిస్తుంది.

—ఈపద్ధతేమీ నచ్చలేదు శాంతమ్మకి.

అంతేకాదు! తనపిన్నికి పిచ్చి—కోడలు పిచ్చి—పట్టిందనుకుంది. లేకపోతే ఏమిటా అసందర్భపు ప్రలాపం? ఒక్కతీ గదిలో కూర్చున్నప్పుడూకాదు! ఎవరైనా—ఎంత పరాయి వాళ్ళయినా—కనపడితే చాలును....

తను ఎంతటి పనిలో మునిగివున్నా, ఏదో నిర్వాకంచేసి వలకబోస్తున్నట్లు, ఆపనిని అట్టేవుంచి, వెర్రినవ్వుతో చేతులు తిప్పు కుంటూ—ముందుకు వస్తుంది—

"మా యింటికి వస్తాడండోయ్! ఓ అబ్బిగాడు—" అంటుంది. ఇంకొకప్పుడు, "నాకు మనవడేకావాలి—మనవడే పుడతాడు ....వాడితాతగారి పోలికని!" అంటుంది. ఇంకా, "నాకు — తెలుసు! .... ఇలాగనే అంటున్నప్పుడు, మాకోడలు సిగ్గుపడి తల వంచుకుంటోందా? .... నాగుండెలో ఏదో అంటోందికదా—నీకు చిన్న ముద్దులొచ్చే మనవడు పుడతాడులే సూరమ్మా—అని"...

"నాకు ఇంకే గొడవా అక్కర్లేదు. పిల్లాణ్ణి వొళ్ళో కూర్చోపెట్టుకుని, కృష్ణా రామా అనుకుంటూ జీవితం గడపుకుంటాను. ఇంక ఇంటివిషయాలా?—అదే చూసుకుంటుందీ" అని నవ్వుతుంది—గంతులు కూడా వేస్తుంది.

విన్నవారందరికీ అంతటి ఆశ్చర్యం ఎందుకు కలుగుతుందీ అంటే—ఈ అత్తగారుకూడా ఒకప్పుడు తనకోడల్ని—నలుగురూ చెప్పుకునేలాగ—కోడంటికంపెట్టినదే! కాని, తనకి ఒక మనమడు పుట్టబోతున్నాడనేసరికి, ఆమెలోని మాతృప్రేమ వెల్లువ అయి ప్రవహించ సాగింది. ఇప్పుడు ఆమెను వదలివుండలేక, "నాచేతులతో నేనే పురుడుపొయ్యాలి"అని నెపం పెట్టుకుని. తనూ కోడలు పురిటికికూడా బయలుదేరింది—ఏనాడూ ఏమాటలోనూ సరిపడని వియ్యపురాలు గారింటికి!

ఈ అమ్మాయిని చూడడానికి వచ్చింది జానకి.. ఇద్దరూ ఒకవూరి వారుట....

"నాకు—నా పురుడేనా??" జానకి ఒక నిట్టూర్పు విడిచింది. చిరునవ్వుతో అంది, "ఎక్కడయినా వొకచేనే సుందరం! నన్ను హింసపెట్టినా—రేపు నాకు పుట్టేవాణ్ణి కాస్త దయతో చూస్తే చాలునే—"

జానకి సుందరం అన్ని కష్టాలూ మరిచిపోయేదాకా కబుర్లు చెప్పుకున్నారు, శాంతమ్మగారి ఇంటి ఒక గదిలో, శాంతమ్మగారి మంచంప్రక్క. కాపరాలకి వెళ్ళిన తర్వాత, ఇలాగ కష్టసుఖాలు చెప్పుకునే సుసమయం వారికెప్పుడూ దొరకలేదు. వారి అత్తలు దొరకనియ్యలేదు. ఒకప్పుడు సూరమ్మ జానకిని అసహ్యించుకునేది. ఈనాడు మనస్ఫూర్తిగా "పండంటి కొడుకుని కని"రమ్మని దీవించి పంపింది!

కాని, శాంతమ్మ మనస్సు తిరగబడింది. పనికి రాదంది. సిగ్గుపడుతున్నానంది. 'నన్ను సిగ్గుపరచడానికి నువ్వెవరు' వంది.

"మీ పిల్లలు పుట్టి ఏం సుఖం బావుకోను? మీరు దరిద్రులు—" అనుకుని నవ్వుకుంది.

లేకపోతే—

తనకళ్ళముందు పుట్టి—నేటికి పెరిగిన ఈ పిల్లలు....పిల్లల తల్లులయి తనకంటే పెద్దవారవుతూ—ఉత్కృష్ట స్థానాన్నాక్రమిస్తోంటే—ఎదుటి ఘనతని సహించలేని శాంతమ్మ—

ఊరుకుని, సహించి. ఉండగలదా?

మాట్లాడకుండా కిటికీ దగ్గరికి వెళ్ళింది: "సుబ్బాయమ్మ పిన్నిగారూ!" అని పిలిచింది.

పెరటిలో పనిచేసుకుంటున్న జానకి అత్త, తలవంచుకుని వున్నది—లేని చిరునవ్వుతో తలయెత్తి ముసుగు సవరించుకుంది.

చిరునవ్వుతో శాంతమ్మ "ఏదో వుంటుంది, ఈరోజు మీ జానకిని వూరుమీదికి విడిచిపెట్టేరు" అంది.

—అది చాలమ్మా—చాలు! నిప్పంటించడానికి! ఆ యింటికి!! ఈనాటికి !!!

*   *   *

ఆమెకు పిల్లలు కావాలనే కోరికవున్నదే కాని, పిల్లలంటే యేమిటో—తల్లి అంటే ఎలావుంటుందో—పిల్లలకీ తల్లికీ సంబంధించివున్న ప్రేమ ఎలాంటిదో—వారిని కట్టి పడవేసే విపరీతమైన, అమానుషమైన శక్తి యేమిటో....

ఆమెకు అర్థంకాలేదు—కాదు; తెలియదు; నేర్చుకోలేదు; తెలుసుకోడానికి తాపత్రయపడలేదు.

అందుచేతనే ఆమె యింకా మాతృపథంలో పడలేదు. ఆమెకు మాతృత్వానికి—ఆ స్థానానికి—హక్కులేదు! సంపాదించుకోలేదు..తగదు!....

ఈ విధంగా నడచివచ్చినవే ఇన్ని రోజులూను .... ఇన్ని సంవత్సరాలూను.

తనకంటే ఎంతదూరమో చిన్నది: పక్కింటి రవణ అప్పుడే ముగ్గురు పిల్లల తల్లయింది! ఎందుకవ్వాలి? తనెందుకు కాకూడదూ?—పోనీ, అందులో ఒక్క పిల్లకి తను తల్లి అవకూడదూ? ఆమె చేసిందేమిటి? తను చెయ్యనిదేమిటి??

ఈ ప్రశ్నలే—ఈ వూహలే — ఆమెను రవణనుండి వేరుచేశాయి. తెలియకుండానే లోలోన నిప్పు రగిల్చేయి....నానాటికీ అది ఒక ప్రళయంలాటిదయింది. శాంతమ్మ—గోడమీదనుంచి రవణమ్మ మాతృహృదయంలోకి చూస్తుందేకాని—ఆమెకీ తనకీ ఎన్నో యోజనాలదూరంవున్నట్లు—ఆపిల్లలకీ తనకీ మధ్యని ఎంతో లోతుని—కళ్ళు గిరగిర తిరిగేపోయే—ఏమీ కనపడని—అగాధాలనీ చూస్తుంది....ఆపిల్లలకేసి తను చేతులు జాపుతుంది. కాని తనచుట్టూవున్న చీకట్లో ఆమెను వారికగపడకుండా చేస్తాయి. చేతులు జాపిన తను సిగ్గుపడుతుంది.

తనని వారు గ్రహించలేదు కదాఅని తను బాధపడుతుంది—

కోపంతో తిరిగి వెళ్ళిపోతుంది!....

*   *   *

## 4

ఎంత ఏమనుకున్నా తనూ ఒక ఆడదే: ఎంత ఇరుగూపొరుగుతో తనకు సరి

పడదనుకున్నా, ఏదోవిధంగా సరిపెట్టుకునే ఆడదాని మనస్సే తనదీను.

నలుగురూ రవణని పిలిచినవిధంగా పేరంటానికికూడా రమ్మని పిలవకపోయినా, వాళ్ళందరూ వెడుతోంటే తనూ బయలుదేరింది—కరణంగారింటికి.

కరణంగారి మనవరాలకి భారసాల గుంపులు గుంపులుగా పేరంటాళ్లు ఊరు నలుమూలలనుంచీ పోగయ్యారు. ఒక గుంపుతో కలసివచ్చినదైనప్పటికీ శాంతమ్మ వంటరిది. ఆమెలాగే వంటరిగా రాలేదు రవణ. కూడా ముగ్గురు పిల్లలనీ పెట్టుకు వచ్చింది....

పిల్లలతో పదిమందిలోనూ కూర్చున్న రవణని చూడ్డానికి ముచ్చటగానేవుంది. ఆమె అందకత్తె కాకపోయినా అందంగానే వుంది. అసలు వడిలో చంటిబిడ్డని పెట్టుకుని కూర్చోడమే ఒక అందం. ఆమెలో ఒక సౌమ్యం కనపడింది. కాటుక పెట్టుకున్న ఆమె కళ్ళల్లోంచి ఒక హాసద్యుతి ప్రవహిస్తోంది—మాటికి మాటికీను.

ఆమెలో ఆమె అయి—నిద్రలో నవ్వుతూ పడుకునీ, మధ్యమధ్య కదులుతూవుంది—నెలల కడసారిపిల్ల ....ఇట్టే కళ్లుతెరుస్తుంది. పలకరిస్తే నవ్వుతూ—ఎర్రబుగ్గలు కందిపోయేలాగ—ఎవరితోనూ కావిన్నట్లు—దేన్నోచూస్తూ ఆడుకుంటుంది. ఎడపిల్ల రెండేళ్ళది. ఎర్రటి పువ్వులగౌను తొడుక్కుంది. నిమిషానికి అక్కతో కజ్జాలాడుతుంది. నిమిషానికి నిద్రపోతున్న చెల్లిమీద పడి ముద్దులలో మునిగిపోతుంది—తల్లిని వచ్చిరానిమాటలతో విసిగిస్తుంది .... చటుక్కున లేచినుంచుని, ఏడుపుమొహంతో 'ఇంటికిపోదామని' పేచీపెడుతుంది.

పెద్దది కొంచెం తెలిసినపిల్ల—అంటే, నలుగురిలోనూ తను అల్లరిచెయ్యకూడదని యెరిగినపిల్ల. తన చారడేసి నల్లకళ్ళతోనూ నలుగురినీ ఆకర్షిస్తూ, తన మాటకారితనంతో అందరినీ ఆనందంతో ఊగులాడిస్తోంది.

వచ్చిన పేరంటాళ్లంతా తిన్నగా రవణ దగ్గరికివచ్చి పలకరిస్తున్నారు. చంటిపిల్లని ఒక్కసారి ముద్దుపెట్టుకునో, బుగ్గనిమిరో, ఏదో పల్కరించో—లేదూ ఎత్తుకునో మరీ వెడుతున్నారు..... ఈవిధంగా చేసిన వాళ్ళల్లో మళ్ళీ చాలామంది చంటిపిల్లల తల్లులే!

ఇదంతా చూస్తూనేవుంది శాంతమ్మ. కొంతసేపు తల రెండోవైపుకు త్రిప్పుకుంది-లోపల కదలుతున్న అసూయతో మరికొంత సేపు ఒక వెగటుతో రవణవేపు చూడసాగింది....

ఆ వెగటూ పోయింది. పోలేదు—పరాకులో మరచిపోయింది ....ఎందుకో తెలియని....ఆనందమేనా అది?....'—'తో చూడసాగింది!

ఆమెని ఆ కట్టుకున్నది రవణలోని సౌమ్యం కాదు; మాతృ సౌందర్యమూ కాదు; ఆమెలో సహజంగావున్న మంచితనమూ కాదు! నలుగురినీ తనవైపు ఆకర్షించుకోగలిగే నవ్యంగా ప్రసరించుకువచ్చిన శక్తి కూడా కాదు—ఆమె ప్రకృతిలోనిదేదీ కాదు. ఆమె కానేకాదు....

ఏస్థిరంగానూ లేక, అటూ ఇటూ లేచి, కూర్చునీ—అల్లరిచేసీ, ఏడ్పు మొహం పెట్టీ—ఏదో లోకంలో ఎగిరిపోతున్న—అప్పుడే ఎగరడం నేర్చుకున్న రామచిలుక—

కమల....రవణ రెండో పిల్ల?

మళ్ళీ—శాంతమ్మని వశం చేసుకున్నది కమల అందం కాదు, అలంకరణా కాదు, అల్లరీ కాదు. ఏదో చెప్పలేని నిర్మలత్వం—అమాయకత్వం—ఎవరికీ సంబంధించి లేని ప్రణయం—

ఏమో చెప్పలేదు. శాంతమ్మకి మనస్సులో ఏవేవో కోర్కెలు చెలరేగేయి. వింతవింత భావాలు విజృంభించేయి.

ఆమె చేతులు వణకేయి—ఫాలతలాన్ని స్వేదబిందువులుద్భవించేయి....

ఎందుకు? ఆమెమీదపడిన వర్షం జల్లు ఏమిటది?—ఏమీ కాదు....ఒక్కసారి కమలని కొంచెం తనదగ్గిరికి తీసుకుంటే.... తన గాజులచేతులతో అలాగ అదిమి పట్టుకుంటే....తన బంగారు గాజులు కమల ఈవలికి తియ్యడానికి తన చెయ్యిని గట్టిగా లాగాలి....పోనీ—ఒక్కసారి ఎర్రటి ఆ బుగ్గలు నిమిరితే....ఎంత బాగుంటుందీ?

అయితే మరి—రవణకీ తనకీ విరోధం, రవణ పిల్లలు తనకెందుకు? వారి గొడవ తన కెందుకు?....

ఏం....కాదంటుందా?....

తనూ వెళ్ళి—ఇంకొంచెం దగ్గరసా వెళ్ళి—ఆ చంటిపిల్ల నున్నటి నిగనిగలాడే పాలబుగ్గలని నిమిరితే—ఏడుస్తుండే ఎర్రటి చిట్టి పెదవులమీద ముద్దాపెట్టుకుంటే—

ఎడపిల్లని తన వడిలోకి తీసుకుంటే—కాదంటుందా రవణ?

....కాని, తన అహం, తన ధనం, ఆమెను ఆమె అనుకున్న పనినుంచి దూరం చేశాయి.

మంగళహారతి సమయాన్ని రవణ పాట పాడింది. రవణ పాడుతోంటే తన ముద్దు కంఠంకూడా కలుపుతూ వచ్చింది సీత.... సీతకూడా అప్పుడే పాటలు నేర్చుకుంది!

శాంతమ్మ సందెమసకలవేళ అందరితోటీ యింటికి మళ్ళింది. రవణ వెనక్కాల, పిల్లలని చూస్తూ, వాళ్ళ అడుగులలో తనూ అడుగులు లెక్కపెట్టుగుంటూ వెళ్ళింది. ఇల్లు చేరిన గంటవరకూ మళ్ళీ సీతగాని, కమల గాని వాళ్ళ అరుగుమీద కనుపడతారేమోనని నిరీక్షించింది.

రవణ యింట్లో అడుగుపెట్టిందో లేదో—ఆమె తల్లి ఇన్ని ఉప్పూ మిరపకాయాలూ దిగతుడిచి కళపెళలాడే నిప్పులలో పోసింది. పెరటి అరుగుమీద పచార్లు చేస్తున్న శాంతమ్మని ఉక్కిరి బిక్కిరి చేసింది—ఆఘాటు.

---

(వచ్చే సంచికలో మరికొన్ని రసమయ ఘట్టాలు)